

# హైదరాబాద్ వార్త

# అప్పులు ..అవస్థలు

**-వ్యాపారాలు,వాటి విస్తరణకు అధిక వడ్డీలకు అప్పులు**
**-లక్షలు, కోట్లలో తీసుకుంటున్న వ్యాపారులు**
**-ఆ డబ్బు చెల్లించకుండా న్యాయస్థానాల బాట**
**-దీంతో అప్పు ఇచ్చిపుచ్చుకున్నవారి మధ్యవైషమ్యాలు**
**-హత్యలు, ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్న పలు సంఘటనలు**

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:** నగరంలోని హయత్‌నగర్ ప్రాంతంలో వ్యాపార రంగంలో పేరొందిన ఒకుటుంబం కొన్నాళ్లుగా కనిపించటం లేదు. వ్యాపారంలో నష్టం రావటంతో దివాళా తీసినట్లు ఆమోదించాలంటూ సదరు వ్యాపారి.. న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. న్యాయస్థానం దీనిని ఇంకా ఆమోదించకున్నా ఆకుటుంబానికి రూ. లక్షలు, రూ. కోట్లలో అప్పులిచ్చినవారు ఆందోళనకు గురవుతున్నారు. అలాగే మలక్‌పేట్‌లో వైద్య సేవల విస్తరణకు ఓ వ్యాపారి భారీగా అప్పులు చేశారు. వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయారు. అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి పెరగటంతో బలవన్మరణానికి పాల్పడ్డారు. సదరు వ్యాపారి కుటుంబం దెబ్బతినటంతోపాటు అప్పు ఇచ్చినవారు నష్టపోయారు.వ్యాపారంలో నష్టపోయినవారు దివాళా తీసినట్లు ప్రకటించాలని న్యాయస్థానాలను ఆశ్రయిస్తు ఐపిలు పెడుతున్నారు. ఇటువంటి ఘటనలు



వ్యాపార వర్గాలు,ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

**వ్యాపారాల విస్తరణ...**

కొందరు వ్యాపారులు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు తెలిసినవారి నుంచి వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. అధిక వడ్డీ ఆశతో బ్యాంకుల్లో ఫిక్స్ డిపాజిట్ల కన్నా వ్యాపారులకు అప్పు ఇచ్చేందుకు కొంతమంది ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు ప్రాంసరీ నోట్లు, ఖాళీ చెక్కులు రాసివ్వటంతోపాటు కొందరు గృహాలు, ఇళ్ల స్థలాలను షూరిటీగా పెడుతున్నారు.

**అత్యాశకు పోవద్దు..**

వ్యాపారాల విస్తరణకు కొందరు వ్యాపారులు అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. వ్యాపారంలో వచ్చే లాభం వడ్డీలు చెల్లించేందుకు సరిపోదు. వ్యాపార విస్తరణలో ఆచితూచి అడుగులు వేయాలి. పెట్టిన పెట్టుబడులకు భరోసా లేకుండా వ్యాపారం చేయవద్దు. అప్పు తీసుకునే సమయంలోనూ తాము తీర్చగలమా లేదా అని పలుమార్లు ఆలోచించాలి. కష్టకాలంలో ఆర్థికంగా చేయూతనిచ్చిన వారికి తిరిగి అప్పు చెల్లించాలి. అప్పు ఇచ్చేవారు సైతం అధిక వడ్డీలను ఆశిస్తే నష్టపోతామని గుర్తించాలి.సానుకూల వ్యాపారాలు చేసే వారికి ధర్మ వడ్డీకి అప్పులు ఇవ్వాలి.ఆర్భాటపు వ్యాపారాలను చూసి, కొద్దిరోజుల క్రితమే పరిచ యమైన వారి మాయమాటలునమ్మి మోసపోవద్దు.

**కుటుంబాలు ఛిన్నాభిన్నం..**

కాలం కలిసిరాక కొందరు వ్యాపారంలో నష్టపోతున్నారు. నెలనెలా వడ్డీలు చెల్లించాల్సి రావటంతో తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. నెలల పాటు వడ్డీ, అసలు చెల్లించలేక అప్పు ఇచ్చిన వారి నుంచి నిరసనలు, ఆగ్రహాలను చవిచూస్తున్నారు. సదరు వ్యాపారులు మనస్తాపంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మరి కొందరు వ్యాపారులు దురాలోచనతో బినామీ పేర్లతో ఆస్తులను కూడబెట్టి వ్యాపారంలో నష్టపోయినట్లు ప్రకటి స్తున్నారు. వారికి అప్పులిచ్చిన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. తినీ తినకా కూడబెట్టుకు న్నామని, పిల్లల పెళ్లికి దాచుకున్నామని, తమ పిల్లల విద్యకు ఉపయోగపడుతుందనుకున్నామని అప్పు ఇచ్చి నష్టపోయిన కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి. వ్యాపారాల విస్తరణ కోసం అధి క వడ్డీలకు అప్పు చేయొద్దు. అప్పు ఇచ్చేవారూ అత్యాశకు పోవద్దు. సానుకూలంగా ఉంటేనే ఆర్థికంగా ఇద్దరికీ మేలు జరుగుతుంది. పెద్దమొత్తాలను ఒక్కరికే ఇవ్వొద్దు. ఆత్మహత్య ఘటనలతో అప్పు ఇచ్చినవారు అడగలేని పరిస్థితి ఏర్పడుతోంది.

# ట్యాంక్‌బండ్‌పై "విజయోత్సవ పండుగ

**-ఘుమఘుమలాడుతున్న తెలంగాణ రుచులు -సంస్కృతి ఉట్టిపడేలా ప్రదర్శనలు**







**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మూడురోజులపాటు నిర్వహిస్తున్న ముంపువేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి.విజయోత్సవాలలో భాగంగా నెక్లెస్ రోడ్ లో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లను రాష్ట్ర శాసన సభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, ఈ రోజు సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మున్సిపల్ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్, జీఏడీ ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు పాల్గొన్నారు.

పలు పసందైన వంటకాలతో ఫుడ్ స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం, పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలంకరణతో మెరుస్తాన్నాయి. నగరంలో ప్రసిద్ధి చెందిన పలు బ్రాండెడ్ హోటల్స్ ఈ ఫుడ్ స్టాళ్ళ కౌంటర్స్ ఏర్పాటు చేశాయి. హైదరాబాదీ బిర్యాని, మొగులాయి వంటకాలు, చాట్, ఐస్ క్రీం, నార్తన్ తదితర వెరైటీ ఫుడ్ స్టాళ్ళ ఏర్పాటు. హైద రాబాద్, మొగులాయి, తెలంగాణ, ఆంధ్ర వంటకా లతో పాటు బేకరి ఐటమ్స్ ఐస్ క్రిమ్ పార్లర్లను విజయోత్సవాల్లో పాల్గొనే సందర్శకుల సౌకర్యార్థం వందకు పైగా ఫుడ్ స్టాళ్లను అందుబాటులోకి తెచ్చారు. అంతర్జాతీయంగా పేరొందిన హైద్రాబాదీ దమ్ బిర్యాని తోపాటు మొగలాయి, జఫ్రాని బిర్యాని పర్యాటకులకు అందించేందుకు ప్రముఖ హోటళ్ళయిన ప్యారెడైజ్, పిస్తా హౌజ్, షా దాబ్, బడే మియా కబాబ్ తదితర హోటళ్లు తమ బ్రాండ్ స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. వీటి తోపాటు తెలంగాణ వంటకాలుగా పేరొందిన పాల మూరు గ్రిల్, తెలంగాణ విందు, అంకాపూర్ నాటు కోడి చికెను, ఫుడ్ జాయింట్స్ ను అందు బాటులోకి తెచ్చారు. నిలోఫర్ కేఫ్, బ్రౌన్ బేర్ బేకరిలు ప్రాం కిల్ మ్యాగి హాట్స్పాట్ కాంటినెంటల్ కాఫీ, ఫ్రాంకి అండ్ రోల్స్, మొమోస్ అండ్ ఫ్రైస్ తో పాటు గోకుల్ చాట్ కూడ తమ సంస్థ ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేసారు.

వీటి,తో పాటు ఆగ్రా చాట్ అండ్ స్వీట్స్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్లను కూడ ఏర్పాటు చేశారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఆరోపణలు

**-బిఆర్ఎస్,బిజెపి రెండు ఒక్కటే**
**-రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి**
**- మంత్రి పొన్నం ప్రభాకర్**



చార్మినార్ వద్ద జరిగిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**చార్మినార్,డిసెంబరు 7 ప్రభాతవార్త :** తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు కాంగ్రెస్‌పై లేని పోని ఆరోపణలు చేస్తూ శాపణార్థాలు పెడుతున్నాయని, బిజెపి,బిఆర్ఎస్‌లు రెండు ఒక్కటేనని రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం పాటు పడుతుంటే ప్రతిపక్షాలు అడ్డుకంటున్నాయని తెలియజేశారు.పాతబస్తీ చార్మినార్ వద్ద శనివారం చార్మినార్, బహదూర్ పుర, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిలు ముజీబుల్లా షరీఫ్,పులిపాటి రాజేష్ కుమార్,బోయ నగేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా రాష్ట్రంలో 116.13 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, 200 విద్యుత్ యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రెండు లక్షల రూపాయలు రుణ మాఫీ చేసిందని తెలియజేశారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించటం లేదని,కేంద్ర పర్యాటక,అర్కియాలజీ శాఖల మంత్రిగా జి.కిషన్‌రెడ్డి ఉన్నప్పటికి హైదరాబాద్ నగరాభివృద్ధికి బిజెపి ఏమి చేసిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో విద్యా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని,ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసుతుల కల్పన కోసం 1900 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నదని, అదే విధంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీపాధ్యాయులకు పదోన్నతులు ప్రభుత్వం కల్పించిందని ఆయన తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలో 55,143 ఉద్యోగాలను భర్తీ చేసిందని, ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికి ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెల ఒకటివ తేదీన ప్రభుత్వం జీతాలు చెల్లిస్తున్నదని ఆయన తెలియజేశారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి కోసం, ప్రజల సుఖాలు కోసం హెచ్ఎండిఎ, జిహెచ్ఎంసిల ఆధ్వర్యంలో ఏడు వేల కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయటం జరిగిందని,రానున్న నాలుగు సంవత్సరాలలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వం మంచి పేరు తెచ్చుకుంటుందని ఆయన తెలిపారు. రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం పేదల ప్రభుత్వం రాష్ట్రంలోని పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్సీ అమేర్ అలీ ఖాన్ మాట్లాడుతూ ..రాష్ట్రంలోని మైనార్టీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ డాక్టర్.రియాజ్,టిపిసిసి కార్యదర్శులు అల్లం భాస్కర్, బాలరాజ్, జి.కన్నయ్య లాల్,నర్సింగరావు,వెంకటేష్ ముదిరాజ్,చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నగేష్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజు యాదవ్, ప్రభాకర్ రెడ్డి, వెంకటేష్, ఓం ప్రకాష్ శర్మ, వరలక్ష్మి, ఆర్.అశోక్ రెడ్డి, మూసాకాశిం, తిరుపతి చంద్రశేఖర్,ముత్యం యాదవ్, లక్ష్మణాచారి,బాను ప్రకాష్ యాదవ్,రజా అలీ,అస్గర్ అలీతో పాటు నాలుగు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.చార్మినార్ వద్ద ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను విజయవంతం చేసినందుకు చార్మినార్, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట కాంగ్రెస్‌పార్టీ ఇంఛార్జిలు ముజీబుల్లా షరీఫ్, పులిపాటి రాజేష్ కుమార్,బోయ నగేష్‌లు పాతబస్తీ కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.

# రేవంత్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదు

**-కాంగ్రెస్, బిఆర్ఎస్ కవల పిల్లలు**
**-రెండింటి డిఎన్ఎ ఒక్కటే : కిషన్ రెడ్డి**



**హుడా కాంప్లెక్ డిసెంబరు 7, ప్రభాతవార్త:** అసత్యపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ పాలనలో ఏ వర్గము సంతోషంగా లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం సరూర్నగర్ స్టేడియంలో కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై బిజెపి తలపెట్టిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి చెందాలంటే అది బిజెపితోనే సాధ్యమవుతుంది అన్నారు.రేవంత్ మాటలకు చేసే పనులకు ఎక్కడ పొంతన లేకుండా ఉందన్నారు. తెలంగాణలో రేవంత్ సర్కార్ పేదలను ఎంతగానో హింసిస్తుందన్నారు. పదేళ పాలనలో విసుగు పోయిన ప్రజలు మార్పు పేరుతో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పది నెలలోనే హామీలు నెరవేర్చక వ్యతిరేకతను మూట కట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ పార్టీ పాలనలో ఎటువంటి తేడా లేదని రెండు పార్టీల డిఎన్ఏ ఒకటేనని, కవల పిల్లలు లాంటివారని అన్నారు. రేవంత్ రెడ్డి అహంకారమైన భాష కుటుంబ పాలనను ఎండగట్టారు. సంక్రాంతిలో లోపల రైతు రుణమాఫీ చేయకుంటే కాంగ్రెస్ నాయకులను రోడ్లమీద తిరగనియ్యమని హెచ్చరించారు. కాగా ఈ సభకు జాతీయ అధ్యక్షునితో పాటు కేంద్రమంత్రులు , సీనియర్ నాయకులు పాల్గొనడం బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షుడు బిజెపి ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, బిజెపి జాతీయ ఓబీసీ అధ్యక్షుడు కే లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీలు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, నగేష్, పొంగులేటి సుధాకర్ రెడ్డి, బండారు శృతి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, రూరల్ అధ్యక్షుడు బొక్క నరసింహా రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# మణికొండ, మంచిరేవులలో హైడ్రా కమిషనర్ తనిఖీ

**హైదరాబాద్, డిసెంబర్ 7,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా, గండిపేట మండల పరిధిలోని మణికొండ మున్సిపాలిటీ, అల్కాపురి టౌన్‌షిప్‌లో అనుహర్ హోమ్స్ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన మార్నింగ్ రాగా గేటెడ్ కమ్యూనిటీని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం పరిశీలించారు. మార్నింగ్ రాగ గేటెడ్ కమ్యూనిటీలో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్‌గా వినియోగించడంపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్ళి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్‌తో పాటు నివాసితులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను విచారించి రెసిడెన్షియల్ అనుమతులు తీసుకున్న ప్రకారమే నిర్మాణాన్ని ఉంచాలని, ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను కమర్షియల్‌గా మార్చిన పక్షంలో నిర్మాణ సామర్థం సరిపోదని సూచించారు. అనుమతుల మేరకే ఆ భవన వినియోగం వుండాలన్నారు. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్ గా మార్చడాన్ని మేము ప్రశ్నిస్తే తమను బెదిరిస్తున్నారని పలువురు నివాసితులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనూహర్ హోమ్స్ అనుమతుల పత్రాలను పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంచిరేవుల దగ్గర మూసీ ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మూసీ నది పరివాహకంలో మట్టిపోసిన నిర్మాణ సంస్థలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ మట్టిని వెంటనే తొలగించాలని సదరు నిర్మాణ సంస్థలను హెచ్చరించారు.

# ప్రమాదంలో ఐదుగురు యువకులు మృతి

**-ఎల్బీనగర్‌లో నెలకొన్న విషాదఛాయలు**

**ఎల్‌బినగర్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** కారులో ప్రయాణిస్తున్న యువకులు కారు అదుపుతప్పడంతో ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోగా మరో యువకుడు గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఎల్బీనగర్ ప్రాంతంలోని శివశంకర్ కాలనీ,సిరినగర్, మజీద్‌గల్లి, ఆర్టీసీ కాలనీలలో విషాదఛాయలు నెలకొన్నాయి. యాదాద్రి బువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్పూర్ వద్ద కారు అదుపు తప్పిన ప్రమాదంలో ఐదుగురు యువకులు ప్రాణాలకు కోల్పోయారు. శివశంకర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ తీగుళ్ల శంకర్ కవిత దంపతుల కుమారుడు వంశీగౌడ్ 23 ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. మజీద్‌గల్లీకి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ వీరమల్ల సత్యనారాయణగౌడ్ లక్ష్మి దంపతుల చిన్న కొడుకు వీరమల్ల విగ్నేష్ 21 ఇంటర్మీడియట్ చదువుకున్నాడు. మజీద్ గల్లీలో నివాసం ఉండే కారు డ్రైవర్ ఇంద్రవల్లి శ్రీనివాస్ మధురవాణి దంపతుల కుమారుడు మెడికల్ సర్జికల్స్ సేల్స్ భాయిగా పనిచేస్తున్న హర్షవర్ధన్ 19 ఆర్టీసీ కాలనీకి చెందిన అశోక్ లేలాండ్ కార్పెంటర్గా పనిచేసే కలకోటి నరసింహచారి నిర్మల దంపతుల కొడుకు అక్షయ్ అలియాస్ బళ్ళు 19 ఇంటర్ చదువుకున్నాడు. వాస్తుకాలనీలోని శ్రీనగర్‌కు చెందిన మగ్గం పనిచేసే జిల్లా వెంకటేష్ వనజ దంపతుల కుమారుడు జిల్లా విజయ్ 20 బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు అదే కాలనీకి చెందిన మెడబోయిన మణికంఠలు ఆరుగురు స్నేహితులు కాగా వీరంతా శనివారం కళ్ళు సేవించడానికి కారులో బయలుదేరగా జలాల్పూర్ గ్రామ సమీపంలో కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న మణికంఠ మినహా మిగతా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. తమ కుమారులు ప్రమాదంలో మరణించిన వార్త తెలియడంతో ఆయా కాలనీలలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతుల తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితుల రోదనతో ఆయా కాలనీలో విషాదంగా మారాయి.

# గోడ కుర్చీ వేయించిన ఉపాధ్యాయుడు

**-ఇంటికి వెళ్లి ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్యాయత్నం**
**-రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**గచ్చిబౌలి, డిసెంబరు 7 ప్రభాతవార్త** సరిగా చదువుకోవడం లేదని రాయదుర్గంలోని ప్రైవేటు స్కూల్‌లో ఓ ఉపాధ్యాయుడు అందరి ముందు ఓ విద్యార్థిని తిట్టడంతో పాటు గోడ కుర్చి వేయించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన సదరు విద్యార్థి ఇంటికి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం సంచలనంగా మారింది. ఉపాధ్యాయుడు అందరి ముందు తిట్టడం, గోడకుర్చి వేయించడం కారణంగానే తమ కుమారుడు ఆత్మహత్యకు యత్నించాడని తల్లిదండ్రులు రాయదుర్గం పోలీసులకు పిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూడగా, ఘటనకు సంబంధించిన వివరాలు డిఐ సతీష్‌కుమార్ తెలిపిన ప్రకారం... రాయదుర్గంలోని నాగార్జున హైస్కూల్‌లో బాలు అనే విద్యార్థి 10వ తరగతి చదువుతున్నాడు. ఈ స్కూల్‌లో అబ్దుల్ నయీమ్ అనే ఉపాధ్యాయుడు మాథ్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కాగా ఈనెల 4వ తేదీన మ్యాథ్స్ సబ్జెక్టు బోధించే సమయంలో టీచర్ అబ్దుల్ నయీమ్ లెక్కలు సరిగా చేయడం లేదని విద్యార్థి బాలును మందలించాడు. క్లాస్ రూమ్‌లో అందరి ముందు బాలు చేత గోడకుర్చి వేయించడంతో పాటు మిగిలిన విద్యార్థుల ముందు తిట్టడంతో బాలు తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇదే క్రమంలో సాయంత్రం ఇంటికి వెళ్లిన బాలు తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. విషయం గమనించిన తల్లి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి బాలును రక్షించి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలు వెంటిలేటర్ మీద చికిత్స పొందుతుండగా, బాలుడి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. దీంతో తల్లి శోభ శుక్రవారం సాయంత్రం రాయదుర్గం పోలీసులను ఆశ్రయించింది. ఉపాధ్యాయుడు అబ్దుల్ నయీమ్ అందరి ముందు తిట్టడం, గోడ కుర్చి వేయించిన కారణంగా తన కుమారుడు మనస్థాపానికి గురై ఆత్మహత్యకు యత్నించాడని పిర్యాదు చేసింది. దీంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# నేడు ట్యాంక్‌బండ్‌పై ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త** కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా ఈ నెల 8వ తేదీన హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఎయిర్ షో నిర్వహించనున్నారు. ఈ ఎయిర్‌షో 30 నిమిషాల పాటు నిర్వహించనున్నారు. ఎయిర్ షోలో భాగంగా వాయుసేన విమానాలు విన్యాసాలు ప్రదర్శించనున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్యాంక్‌బండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

# విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన




కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ మండలం డిసిపి స్నేహా మెహ్రా

**చార్మినార్,డిసెంబరు 7 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ జహానుమాలోని సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్‌లో శనివారం సైబర్ క్రైమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్స్,మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రా మాట్లాడుతూ బాలికలు మంచి క్రమ శిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను తప్పకుండ ఆధిరోహిస్తారని తెలిపారు.సమావేశంలో డిసిపి స్నేహా మెహ్రా సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలు,మహిళల హక్కుల పరిరక్షణ ప్రాముఖ్యత,మాదక ద్రవ్యాలు గురించి వివరించారు.కార్యక్రమంలో అడిషనల్ డిసిపి ఎంఎ మాజిద్, కాలాఫత్తర్ సిఐ మహ్మద్ ఆసిఫ్,సైబర్ క్రైమ్ సిఐ ధనలక్ష్మి,ఎస్ఐ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో రెండు నిండు జీవితాలు చిత్తు..

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 7, ప్రభాతవార్త:** మద్యం మత్తులో రెండు నిండు జీవితాలు చిత్తుగా మారాయి. అతివేగం.. అజాగ్రత్తగా ద్విచక్రవాహనంపై వెళ్లిన ఇద్దరు యువకులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు మృత్యువాత పడిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లి ప్రాంతానికి చెందిన దొంతరి కార్తిక్‌రెడ్డి (26) ప్రైవేట్ జాబ్ చేసుకుంటున్నాడు. నెల్లూరు జిల్లా కేంద్రానికి చెందిన ఆరుద్ర అనిల్ (21) గుండ్లపోచంపల్లిలో ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తుకుంటున్నాడు. వీరిద్దర స్నేహితులు. కొంపల్లిలోని సెంట్రల్ పార్క్‌లో ఉన్న మరో స్నేహితుడు రాకేశ్ వద్దకు శుక్రవారం రాత్రి కార్తీక్‌రెడ్డి తన కొత్త బుల్లెట్ ద్విచక్రవాహనంపై వచ్చారు. ముగ్గురు కలిసి మద్యం సేవించి గుండ్లపోచంపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మార్గమద్యలో గుండ్లపోచంపల్లిలోని క్రిష్ణ ట్రేడర్ స్టీల్ షాప్ సమీపంలో అతివేగంతో దూసుకెళ్లి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. సుమారు రాత్రి 1 గంటల సమయంలో ఇద్దరు ఇంటికి వెళ్ళారా అని తెలుసుకునేందుకు తోటి స్నేహితుడు నరేశ్ ఫోన్ చేస్తే ఎంతకు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అదే రాత్రి తన బైక్‌పై గుండ్లపోచంపల్లికి వస్తుండగా రోడ్డు పక్కన ఇద్దరు పడి ఉన్నారు. వెంటనే వారి వద్దకు వెళ్లి చూడగా తన స్నేహితులుగా గుర్తించి వెంటనే కార్తిక్‌రెడ్డి తండ్రి నర్సింహారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. గాయపడిన వారిని హుటాహుటీన కొంపల్లిలోని శ్రీఖర ఆసుపత్రికి తరలించగా కార్తిక్‌రెడ్డి అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అనిల్ కొన ఊపిరితో ఉండడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కార్తిక్‌రెడ్డి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల ముఖ్యం

### -బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్





బాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న గోపీచంద్, నిత్యానందరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:**
క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల, అభిరుచి వంటి విలువలు ముఖ్యమని బ్యాడ్మింటన్ కోచ్, పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. ఈమేరకు శనివారం గాడ్నియా స్పోర్టోపియాలో గాడియం సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ 2024 ఐదో ఎడిషన్ పోటీలను చైర్మన్ నిత్యానంద రెడ్డి, సీఈఓ రామకృష్ణా రెడ్డి, స్కూల్ హెడ్ సుధేష్ణ ఛటర్జీ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భగా పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ...యువ క్రీడాకారుల్లో బ్యాడ్మింటన్ స్ఫూర్తిని పెంపొందించేలా భారీ స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నందుకు గాడియం స్కూల్‌ను అభినందించారు. ఫౌండర్, డైరెక్టర్ కీర్తి రెడ్డి మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో క్రీడల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈసందర్భంగా గోపీచంద్, చైర్మన్ నిత్యానందరెడ్డి మధ్య జరిగిన స్నేహపూర్వక మ్యాచ్ ప్రారంభోత్సవానికి ఉత్సాహాన్ని నింపింది. కాగా దేశ వ్యాప్తంగా 750 మంది యువ క్రీడాకారులు అండర్11, అండర్13, అండర్15 వయో విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్స్ లో పోటీ పడుతున్నారు.

## లష్కర్ జిల్లా ఏర్పాటుకు సహకరించాలి

### - కేంద్రమంత్రికి వినతి పత్రం అందజేత



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

**సికింద్రాబాద్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** లష్కర్ జిల్లా ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిని జిల్లాగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కిషన్‌రెడ్డి తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారని సాధన సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రం పవన్‌కుమార్ గౌడ్, రవిప్రసాద్‌గౌడ్, బాలరాజ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు కాలేజీ స్థాయి కీలకం : తలసాని



సికింద్రాబాద్ ప్యాట్నీలోని ఎస్.వి.ఐటీ.ప్రెషర్స్‌డేలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే తలసాని, కళాశాల కార్యదర్శి పి.ఎల్.శ్రీనివాస్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** కాలేజీ స్థాయి వారి బంగారు భవిష్యత్తు కీలకమని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ ప్యాట్నీ చౌరస్తాలోని ఎస్.వి.ఐటీ ఇంజనీరింగ్ కళాశాల 2004, 2024 ప్రెషర్స్‌డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు పి.ఎల్. శ్రీనివాస్, మాజీ కార్పోరేటర్ ఆకులరూప, ప్రిన్సిపాల్ ఈశ్వర్, డైరెక్టర్లు అనీల్, పద్మారావు, వినోద్,కాశీరత్నం, మురళీ, రవింద్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన డాన్స్,నృత్యాలు పలువురికి ఆకట్టుకున్నాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి : ఆదం సంతోష్



తుకారాంగేట్‌లో చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేత ఆదం సంతోష్ తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని సికింద్రాబాద్ అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే దం సంతోష్ తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం తుకారాంగేట్ చౌరస్తాలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అడ్డగుట్ట, తుకారాంగేట్, శాంతి నగర్ ప్రాంతాలకు చెందిన మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆదం భరత్,రాము, గంట రాజు సాగర్, ఎస్.యాదగిరి, డి.సందీప్‌రాజు, షకీల్‌ఖాన్, హరి, అమర్‌నాథ్ గౌడ్, జలెందర్‌రెడ్డి, మంద ప్రభాకర్, రమేశ్, నవీన్, జాఫర్, సుదర్శన్,సాయి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు భారీగా తరలివెళ్లాలి

### - బండ్లగూడ కార్పోరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, డిసెంబర్ 7 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సెక్రెటేరియట్‌లో ఈ నెల 9.వ,తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించబడుతున్న "తెలంగాణ తల్లి" విగ్రహావిష్కరణకు బండ్లగూడ కార్పోరేషన్ నుంచి పెద్ద ఎత్తున మహిళలు తరళి వెళ్లాలని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శనివారం కార్పోరేషన్ కార్యాలయంలో రీసోర్స్ పర్సన్స్‌తో కమీషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అధికారిక కార్యక్రమంలో భాగస్వాములయ్యే అవకాశం మన ప్రాంత ప్రజలకు వచ్చిందని, అందరం పెద్ద ఎత్తున తరళి వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేసి వద్దామని కమీషనర్ సూచించారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి

### ఇండియన్ విశ్వకర్మ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ డిమాండ్





ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బిఎన్‌వి రాజశేఖర్, రజనీకాంత్, కుమార్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:**
బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను ఆపేలా కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇండియన్ విశ్వకర్మ ఆఫీసర్స్ బిజినెస్ మ్యాన్, ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ ( ఐవీఓబీపీఎఫ్) కోరింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు బి ఎన్ వి రాజశేఖర్ మాట్లాడారు. బంగ్లాదేశ్ లో హిందువులు మరియు ఇతర మైనారిటీలపై జరుగుతున్న అఘాయిత్యాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. భారతదేశం వల్ల స్వాతంత్రాన్ని పొందిన బంగ్లాదేశ్ ప్రస్తుతం అక్కడ మన వారిపై దాడులకు తెగబడటం హేయమైన చర్య అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేసిన సన్యాసి చిన్మోయ్ కృష్ణ దాస్ తో పాటు ఇంకా ఇద్దరు సన్యాసులను వెంటనే విడుదల చేసేలా ఆ దేశం పై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కుల గణనకు సంబంధించి రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ (బిసిబిలో క్రమ సంఖ్య 21) జనాభా ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వం, బిసి కమిషన్ ను ఆయన కోరారు. విశ్వబ్రాహ్మణ/ విశ్వకర్మ కులాల (అవుసుల, వడ్ల, కమ్మరి, కంచరి మరియు శిల్పి ఇవి విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మల సంప్రదాయ వృత్తులు) ఐదు ఉపకులాల పేరుతో గణన చేపట్టబడుతోందని, ఈ కారణంగా ఆయా వృత్తులలో నిమగ్నమైన వారు మాత్రమే సర్వేలో కవర్ చేయబడుతున్నారే తప్పా వ్యాపార, ఉపాధి, ఇతర వృత్తిలో నిమగ్నమై ఉన్న వారిని లెక్కించడం లేదన్నారు. ఉపకులాలకు బదులు మొత్తం జనాభాను కవర్ చేయడానికి "విశ్వబ్రాహ్మణ / విశ్వకర్మ అనే కులం పేరుతో సర్వే చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి. కుమార్,రజనీ కాంత్,వైఎస్‌వి శ్రీనివాస్ రావుతదితరులు పాల్గొన్నారు.

## బిజెపి బహిరంగ సభకు తరలిన శ్రేణులు



సభకు వెళ్తున్న పార్టీ శ్రేణులు

**జీడిమెట్ల, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన బిజెపి బహిరంగ సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ నుంచి బిజెపి నాయకులు గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అధ్యక్షతన డివిజన్ అధ్యక్షులు సాయినాథ నేత ఆధ్వర్యంలో శనివాకం భారీ ఎత్తున బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర యువ మోర్చా మీడియా కన్వీనర్ రేవతి రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్ పాటిల్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్, డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు లక్ష్మణ్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు రేవతి సింగ్, సీనియర్ నాయకులు రాజు యాదవ్, సదానంద్, నరేష్ గౌడ్, జ్యోతి, రమాదేవి, అంజమ్మ, లక్ష్మణ్ గౌడ్, నవీన్, మహేందర్ రెడ్డి మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టుమిషన్‌ల పంపిణీ

**కంటోన్మెంట్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ తెలిపారు. శనివారం సికింద్రా బాద్ నవకేతన్ కాంప్లెక్స్‌లో వినూత్న ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో మహిళలకు కుట్టు మిషన్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నిరుపేదలకు 30 ఉచితంగా కుట్టుమిసన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, వెంకట్, నిత్యానంద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కెన్నడీ హై ద గ్లోబల్ స్కూల్ వార్సికోత్సవ వేడుకలు



కెన్నడీ హై ద గ్లోబల్ స్కూల్ వార్సికోత్సవ వేడుకలు

**నిజాంపేట్, డిసెంబర్ 7, ప్రభాతవార్త**
కెన్నడీ హై ద గ్లోబల్ స్కూల్‌లో శనివారం 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ కళాశాల, సాంకేతిక విద్యావిభాగంలో కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.శ్రీదేవసేన ఐఏఎస్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో కెన్నడీ హై ద గ్లోబల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్. సుబ్బారెడ్డి, ప్రెసిడెంట్ బి.సుబ్బారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కమాండర్ ఎన్.కృపాకర్‌రెడ్డి, ఎకడెమిక్ డైరెక్టర్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ భట్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమయాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని, సృజనాత్మకతను పెంపొందింపచేసుకొని ప్రతి సమస్యను విశ్లేషణాత్మకంగా ఆలోచించుకుని స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే విధంగా తీర్చి దిద్దాలంటే తల్లిదండ్రుల ఉపాధ్యాయులు సమిష్టి కృషి అవసరమని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ బృంద సహకారంతో అత్యుత్తమ ఫలితాలు సాధించామని, విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తూ ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం రాల్యాజలక్ష్మీ భట్ వార్షిక నివేదికను సమర్పించారు. చదువుతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యయందు కూడా ఎక్కువ కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీదేవసేన ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులకు విలువైన బహుమతులు అందజేసి అభినందించారు.

## కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటే మానవత్వానికి నిదర్శనం : ఎమ్మెల్యే తలసాని



మోండా మార్కెట్‌లో టైలరింగ్ షాప్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబర్ 7 ప్రభాతవార్త:** కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటే మానవత్వానికి నిదర్శనమని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా డివిజన్ ఓల్డ్ జైల్ ఖాన వద్ద గత సెప్టెంబర్‌లో వర్షాలకు టైలరింగ్ షాప్‌లు కూలిపోయాయి. వాటి స్థానంలో నూతనంగా నిర్మించిన 7 షాప్‌లను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ టైలరింగ్ వృత్తిని జీవనాదారం చేసుకొని సాగిస్తున్న 6 కుటుంబాల షాప్‌లు కూలిపోవడంతో దుఃఖనికి లోనైయ్యారు. విషయంపై ప్రభుత్వం దృష్టికి తెచ్చిన పట్టించుకోకపోవడంతో బాధితులకు అండగా ఉండాలని ఒక్కో కుటుంబానికి రూ. 20 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. అదే విధంగా కుటుట మిషన్లను, షాప్‌లను నిర్మించుకోవడానికి సహాయ సహకారాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ ఆకులరూప, బిఆర్ఎస్ అధ్యక్షులు కుల హరిక్రిష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, మేరు సంఘం నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, నర్సింగరావ్, నరేందర్,క్రిష్ణ, సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు.

### దళిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలి

### ఆల్ ఇండియా రక్షణ సేన డిమాండ్





రక్షణసేన నాయకులతో బాధిత కుటుంబాలు

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:**
ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న దళితమహిళా మండలి ఇండ్ల పట్టాల విషయంపై ప్రభుత్వం చొరవ తీసుకుని వారికి న్యాయం చేయాలని ఆల్ ఇండియా రక్షణ సేన జాతీయ అధ్యక్షులు మహ్మద్ సాహిద్ ఖాన్, రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సంఘం జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎల్లమ్మబండ కూకట్‌పల్లిలో 1995లో 200 మంది దళితులకు ఇండ్ల పట్టాలు ఇచ్చారు. అయితే అప్పుడు పట్టాలు ఇచ్చినప్పటికీ వారికి ఇల్లు మాత్రం చూపించలేదు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదన్నారు. దీంతో తమకు పట్టా ఇచ్చి భూమిగురించి స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదన్నారు. దీంతో తమకు పట్టాలు ఉన్నప్పటికీ ఇళ్లు లేకుండా పోయిందన్నారు. ఇదే విషయంపై బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇప్పటి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో దళిత మహిళ మండలి సంఘానికి న్యాయం చేయాలని డిమాండ్ చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. కావున కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున వీరికి పునరావాసం కల్పించి ఇళ్ల పట్టాలు ఉన్న అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డిని కోరారు.

### ఆవును జాతీయప్రాణిగా గుర్తింపు కోసం ఉద్యమించాలి

**రవీంద్రభారతి, డిసెంబరు 7 ప్రభాతవార్త :** శ్రీభారతి ఫౌండేషన్, శ్రీభారతి మ్యూసిక్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో సంగీత సాహిత్య నృత్యకళావికాస వేదిక, హైదరాబాద్ సమర్పణలో, అంతర్జాతీయ గో సేవా ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన గోమాత గానామృతం ఆడియో సీడీ ఆవిష్కరణోత్సవానికి హాజరైన అతిథులు మాట్లాడుతూ ఆవును జాతీయప్రాణిగా గుర్తింపు కోసం అందరం కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ దర్శకుడు నిట్టల గోపాలకృష్ణ విరచించిన గీతాలను సుప్రసిద్ధ గాయకులు సురేఖ, విజయలక్ష్మి, నళిని, పద్మప్రియ, వినోద్‌బాబు, బాలకామేశ్వరరావు, చింతలపాటి సురేష్, మానసవీణ, డా. కృష్ణప్రవంతి, శివరంజని, హరికథ కళాకారుడు శ్రీరామ్ భట్టర్ తదితరులు గానం చేసిన గోమాత గానామృతం ఆడియో సీడిని అమెరికా న్యూజెర్సీలో స్థిరపడిన సామాజిక సేవా కార్యకర్త డా. రవిశంకర్ ప్రత్యేక అతిథిగా హాజరై సభాధ్యక్షుడు డా. ఓలేటి పార్వతీశం, విశిష్ట అతిథులు జమలాపురం రాధాకృష్ణ, రాజమౌళి గుప్త, శ్రీనివాస్, వాసుశర్మ తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. గోవును కేంద్రప్రభుత్వం వెంటనే జాతీయ ప్రాణిగా గుర్తించాలని కోరారు. గో సంబంధిత వస్తువులకు తగిన ప్రచారంచేసి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఓలేటి పార్వతీశం అధ్యక్షోపన్యాసంలో గాయకులు సురేష్, వినోద్ బాబు, రాజేష్‌ల స్వరకల్పన మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే విధంగా ఉందని, గోపాలకృష్ణ రచన, సుప్రసిద్ధ గాయకుల ఆలాపన మళ్లీమళ్లీ వినాలనిపించేరీతిలో పాటలు ఉన్నాయని అభినందించారు.

### జనవరి 30న ఇందిరాపార్క్‌లో గిరిజన గర్జన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐక్యవేదిక నాయకులు

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:**
డిమాండ్ల పరిష్కారానికి జనవరి 30న ఇందిరా పార్కులో గిరిజన గర్జన –మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్టీ సంఘాల ఐక్యవేదిక, ఏజెన్సీ డిఎస్సీ సాధన సమితి, లంబాడీ హక్కుల పోరాట సమితి తెలిసింది. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్టీ సంఘాల ఐక్యవేదిక స్టేట్ కోఆర్డినేటర్ గగులోత్ రాజేష్‌నాయక్, ఆదివాసీ సంఘాల రాష్ట్ర కన్వీనర్ పాయం సత్యనారాయణ, చీఫ్ అడ్వైజర్ పోడుగ శ్రీనాథ్, ఏజెన్సీ డిఎస్సీ సాధన సమితి అధ్యక్షులు జాదవ్ సోమేష్ తదితరులు హాజరై ఛలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నోటిఫికేషన్ ప్రకటనలో, ఆర్టికల్ 244(1) అనుసరించి ఏజెన్సీ ప్రాంతాల్లో వందశాతం ఉద్యోగాలను స్థానిక గిరిజన అభ్యర్థుల తోనే భర్తీ చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో ఏజెన్సీ డిఎస్సీ, జనరల్ డిఎస్సీ రెండు రకాల నోటిఫికేషన్‌లుగా ప్రకటించాలన్నారు. అలాగే ఎస్టీల 10 రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి తెలంగాణాలోని ఐటిడిఏలలో బ్యాక్ లాగ్ ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆదివాసి విద్యార్థి జేఏసీ ఇర్పాప్రకాశ్ దొర, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్, బనోత్ జంపా, సాయి, హనుమంత్‌నాయక్ పాల్గొన్నారు.

## శంకరమఠంలో ఘనంగా హరికథా మహోత్సవాలు



శృంగేరి శంకరమఠంలో భక్త ప్రహ్లాద హరికథాగానం వినిపిస్తున్న శిఖామణి

**హైదరాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త :** నల్లకుంటలోని శ్రీ శృంగేరి శంకరమఠం ప్రాంగణంలో హరికథా విద్వాంసుదు ఆదిభట్ల నారాయణదాసు 160వ, ఆయన ప్రియ శిష్యుడు నేతి లక్ష్మీనారాయణ భాగవతుల 126వ జయంతి సందర్భంగా హరికథా మహోత్సవములు ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య పరివారం తరపున యనమండ్ర వెంకట కృష్ణయ్య, నేతి కుటుంబము నుండి శ్రీనివాస్, చావలి కామేశ్వరరావు దంపతులు, ఉమాదేవి, శారద పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ నారాయణదాసు అనే పేరువింటే 'హరికథ' తెలుగు రాష్ట్రాలలో వెంటనే స్ఫురిస్తాయని, హరికథా రచనవల్లనూ, హరికథా ప్రయోగమువల్లనూ, దాసుగారివలే అఖండ ప్రఖ్యాతిని పొందినవారు వేరొకరు గానరని, దేశములోని రసజ్ఞులందరు పేర్కొన్నారు. నారాయణదాసు నవరస భరితంగా కథాగానము చేయుటలో అందెవేసినచెయ్యని. నారాయణదాసు ఒక్క తెలుగుజాతికే కాక యావద్భారతదేశానికి చిరస్మరణీయులే అని కొనియాడారు. దాసు శిష్యవర్గంలో లక్ష్మీనారాయణ విశిష్ట స్థానమనీ, దాసుకు వీరిమీద పుత్రవాత్సల్యమనీ కూడా అన్నారు. అనంతరం వై.శిఖామణి భాగతారిణి (రామచంద్రాపురం) భక్త ప్రహ్లాద హరికథాగానము చేసి భక్తులను ముగ్ధులను చేశారు. వీరికి డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి వయొలిన్ పైన, ఆర్. సుధాకర్ మృదంగం పైన చక్కటి వాద్య సహకారం అందచేశారు. కళాకారులను నిర్వాహకులు శాలువలతో సత్కరించారు. ఆదివారం జి. మునిలక్ష్మి భాగతారిణి భక్త మార్కండేయ హరికథాగానము చేస్తారని భక్తులందరు సకాలంలో విచ్చేసి శ్రవణం చేయాలని కార్యక్రమ పర్యవేక్షకులు బుర్రా పద్మనాభశర్మ భాగవతులు విజ్ఞప్తి చేశారు.

## ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పై ఎసిపికి కోట నీలిమ ఫిర్యాదు



ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పైన చర్యలు తీసుకోవాలంటూ నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజుకి ఫిర్యాదు చేస్తున్న కోట నీలిమ,విశాల్‌సుధాం,బాధితులు.

**బేగంపేట డిశంబరు7,ప్రభాతవార్త**
చిరు వ్యాపారులపై బేగంపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జులుం ప్రదర్శింస్తుండటాన్ని నిరసిస్తూ బేగంపేట లో సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు. గత కొన్ని రోజులుగా జంట నగరాల పరిధిలోని రోడ్ల ఆక్రమణలను తొలగించేందుకు ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ప్రధాన రోడ్లతో పాటు ట్రాఫిక్ కు అంతరాయం కల్గించే విధంగా ఏర్పాటు చేసిన డబ్బాలను ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారు. అయితే బేగంపేట ప్రకాశం నగర్‌లో బేగంపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఒక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహకునికి చెందిన ఒక డబ్బాను తొలగించే విషయంలో సదరు షాపు నిర్వహకునికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా డబ్బాను ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ తొలగించడంతో పాటు దురుసుగా వ్యవహరించడంపై వివాదం రాజుకుంది. ఈ విషయం తెల్సుకున్న కాంగ్రెస్ నాయకులు విశాల్ సుధాం ఈ విషయాన్ని మాట్లాడేందుకు ప్రయత్నించగా ఇన్స్‌పెక్టర్ సరైన సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోవడంతో వారు ఈ విషయాన్ని విశాల్ సుధాం సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ దృష్టికి తీసుకురావడంతో ఆమె ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సమయంలో పెద్ద సంఖ్యలో ప్రకాష్ నగర్ లోని చిరు వ్యాపారులు తరలి వచ్చి తమ డబ్బాలను తొలగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు తమకు చెప్పి ఉంటే తాము స్వచ్ఛందంగా తొలగించేవారమని,అలా కాకుండా ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ తమపట్ల దురుసుగా వ్యవహరించి డబ్బాలను తొలగించారని,కొన్నింటిని ధ్వంసం చేసారని బాధితులు కోట నీలిమ కి వివరించారు. వారి సమస్య విన్న కోట నీలిమ ఈ విషయాన్ని ఇన్స్‌పెక్టర్ తో మాట్లాడేందుకు ప్రయత్నించగా పట్టించుకోకుండా వెళ్లిపోయారన్నారు, ఈ విషయంలో సీఐ నిర్లక్ష్యంపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని,లేకుంటే ఇన్స్‌పెక్టర్ పై పోలీసు ఉన్నత అధికారులకు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు వారు ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజుకు విజ్ఞప్తి చేసారు. ఈ విషయంలో తగిన విచారణ జరిపి తగిన చర్యలు చేపడతామంటూ ట్రాఫిక్ ఏసీపీ వారికి హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

## మహిళా సాధికారితకు కాంగ్రెస్ పెద్దపీట

### - రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
### - నార్సింగిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



నార్సింగి "ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్"ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు.

**నార్సింగి, డిసెంబర్ 7 ప్రభాతవార్త :** తెలంగాణలో మహిళా సాధికారితకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీత వేస్తుందని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా శనివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 6,9,10,14, 15.వార్డుల పరిధులలో రూ. 14.25కోట్లతో "ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్"తో పాటు గండిపేట జంక్షన్, పార్కు, సిసి రోడ్డు, డ్రైనేజి వంటి పలు అభివృద్ధి పనులను పిసిసి ప్రధాన కార్యదర్శి జువ్వాడి ఇందిరారావ్, ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ విజయ్‌బాబులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రేయింబవళ్లు మన రాష్ట్రంను దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిపేందుకు కష్టపడుతున్నారన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఎన్నికల వేళ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్ధవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు. లక్షలాది మంది మహిళలు నిత్యం ఆర్టీసి బస్సుల్లో ఉచితంగా తమ గమ్యస్థానాలకు వెళ్తూ ఆనందపరవశులవుతున్నారన్నారు. నిరుపేదలు జీరో కరెంటు బిల్లుతో, రైతులు రూ.2లక్షల ఋణమాఫీతో, నిరుద్యోగులు ఉద్యోగాలతో సంతోషంగా ఉన్నారన్నారు. అనతి కాలంలోనే సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై పట్టు సాధించారని తెలిపారు. అటు పార్టీ, ఇటు ప్రభుత్వం రెండింటిలో సీఎం తనదైన ముద్రను వేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను ప్రణాలికబద్ధంగా పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టియుఎఫ్ఐడిసి చైర్మన్ నర్సిహ్మారెడ్డి, కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, లక్ష్మీ ప్రవళిక కిరణ్, అమరేందర్‌రెడ్డి, లంకల పద్మ, వెంకటేష్ యాదవ్, మేనేజర్ యోగేష్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణు గౌడ్, కాంగ్రెస్ నాయకులు క్యాతం అశోక్ యాదవ్, గండయ్య ముదిరాజ్, లంలక పాపిరెడ్డి, దొబ్బ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## భార్య చేతిలో భర్త దారుణ హత్య

### -ఏడాది తర్వాత వెలుగులోకి వచ్చిన నిజాలు

**హైదరాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త**
ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన కేసుకు సంబంధించి నెలకొన్న మిస్టరీని ఏడాది తర్వాత కుల్సుంపురా పోలీసులు ఛేదించారు. మృతుడు ప్రమాదవశాత్తు మరణించలేదని అతడి భార్య, ఆమె సోదరి, స్నేహితురాలు కలిసి హత్య చేసి ఫిట్స్‌తో మృతిచెందినట్లుగా చిత్రీకరించారని ఎట్టకేలకు పోలీసులు నిర్ధారించారు. ఏడాది కిందట జరిగిన అనుమానాస్పద మృతి కేసు హత్యగా తేలిన నేపథ్యంలో శుక్రవారం విచారణ అధికారులు ఇన్‌స్పెక్టర్ సునీల్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌వర్మ, ఎస్ఐ కృష్ణవేణి కేసు వివరాలను వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమన్(35), కృష్ణవేణి భార్యాభర్తలు. వీరిద్దరూ కార్వాన్ హనుమాన్ కాలనీలో నివాసం ఉంటారు. భర్త డోలు వాయిద్యకారుడుగా పనిచేసేవాడు. భార్య స్థానికంగా ఓ ఆస్పత్రిలో హౌస్‌కీపింగ్ పనులు చేస్తుంటుంది. భర్త మద్యానికి బానిసవ్వడంతో ఆ దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. వారి ఇంటికి పక్కనే కృష్ణవేణి సోదరి యశోద ఒంటరిగా నివాసం ఉంటుంది. హాస్పిటల్‌లోని సెక్యూరిటీ గార్డు ప్రశాంతితో కృష్ణవేణికి స్నేహం ఏర్పడింది. సెప్టెంబరు 14, 2023న సుమన్ మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. కొంతసేపటికి అతడి భార్యతో పాటు వదిన, స్నేహితురాలు ఇంటికి చేరుకున్నారు. అంతా కలిసి ఎక్కడికి వెళ్లారు అంటూ సుమన్ వారిని దూషించాడు. అక్క, స్నేహితురాలిని తిడతావా? అంటూ భార్య భర్తను పక్కకు తోసేసింది. ముగ్గురు కలిసి ఇనుప రాడ్డుతో అతడిని గాయపరిచారు. అంతటితో ఆగకుండా వస్త్రంతో గొంతు బిగించి, దిండుతో ఊపిరాడకుండా చేసి చంపేశారు. ఘటనా స్థలంలోని ఆధారాలను చెరిపేసిన అనంతరం మృతదేహాన్ని ఉస్మానియాకి తీసుకెళ్లారు. అతడు అప్పటికే చనిపోయినట్లుగా వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేయగా తాగి కింద పడ్డాడన్నారు. మృతుడి సోదరుడు వారిపై అనుమానం వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదుచేశారు. నాలుగు మాసాలకు పోస్టుమార్టం రిపోర్టు వచ్చింది. హత్య జరిగినట్లుగా ప్రాథమిక వివరాలు వెల్లడయ్యాయి. నిందితులను పోలీసులు విచారిస్తే హత్య చేసినట్లు వెలుగులోకి వచ్చింది.



సోమాజీగూడ విల్లా మేరి మహిళ కాలేజీలో జరిగిన కన్వెన్షన్‌లో పాల్గొన్న విద్యార్థులు

## సెక్స్‌వర్కర్ ముసుగులో మహిళ దొపిడీ

**బేగంబజార్,డిసెంబర్ 7ప్రభాతవార్త:**
విటులను ఆకర్షిస్తు వారినే బెదిరించి డబ్బులను దొచుకుంటున్న ఒమహిళాను సుల్తాన్‌బజార్ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌చారి కథనం ప్రకారం... బిఎస్‌మక్తా ఏరియాలో ఉండే ముస్కాన్ దాబెల అలియాస్ అస్మాఉన్నిసా భర్త ఏడాది కింద మరణించారు. కుటుంబ పోషణ కోసం సెక్స్‌వర్కర్‌గా మారింది. రంగమహల్ చౌరస్తా వద్ద రాత్రి సమయంలో విటులను ఆకర్షిస్తూ అమాయకులను గుర్తించి బెదిరింపులకు పాల్పడుతుంది., బ్లేడుతో బెదిరించి అందినకాడికి దండుకుని వెళ్తుంది. ఫలక్‌నుమా ఏరియాకు చెందిన గులాం మస్తాన్ ఇటివల అఫ్జల్‌గంజ్ నుంచి రంగమహల్‌చౌరస్తాకు వెళ్తుండగా అస్మాఉన్నిసా కనిపించడంతో నిలిచాడు. మాట్లాడుతూనే తన వద్ద ఉన్న బ్లేడ్‌తో ఇతనిపై దాడి చేసింది. సెల్‌ఫోన్లు,వెయ్యి రూపాయలు క్యాష్‌లాక్కుని పారిపోయింది. దీంతో బాధితుడు సుల్తాన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో ఇదే తరహాలో రెయిన్ బజార్ పోలీసుస్టేషన్‌లో పరిధిలో కేసు నమోదు అయినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపారు

## కూలిన ఆలయ స్వాగత ద్వారం

### -పలువురికి స్వల్ప గాయాలు ..ఆలయ కమిటి నేతలపై కేసు నమోదు



రామంతాపూర్ డీమార్ట్ వద్ద నిర్మాణంలో ఉన్న ఆలయ స్వాగత ద్వారం కూలిపోయిన దృశ్యం.

**ఉప్పల్, డిసెంబరు 7 ప్రభాతవార్త :** రామంతాపూర్ ప్రధాన రహదారిలో డీమార్ట్ వద్ద నిర్మిస్తున్న స్వాగత ద్వారం కూలి పలువురు స్వల్ప గాయాలకు గురైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నిర్మాణంలో ఉన్న సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదవశాత్తు కూలిపోయింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. పలువురు స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా స్వాగత ద్వారం నిర్మాణం చేపట్టిన ఆలయ కమిటి నేతలపై కేసు నమోదు చేసినట్లు సిఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపారు.

